



నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com
EVENING EDITION
పేజీలు: 02
4PM


## మెదక్ బరిలో సోనియాగాంధీ?



మెదక్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి పార్టీ అగ్రనేత సోనియాగాంధీని పోటీ చేయాలని ఆహ్వానిస్తూ పీఏసీలో ఏకగ్రీవ తీర్మానం చేసిట్టు షబ్బీర్ అలీ తెలిపారు. ఈ మేరకు సోనియాగాంధీకి, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గేకు లేఖ రాయనున్నట్టు తెలిపారు. గతంలో ఈ స్థానం నుంచి ఇందిరాగాంధీ పోటీ చేసి గెలిచిన విషయాన్ని గుర్తు చేశారు.



## త్వరలో 14 వేల అంగన్‌వాడీ పోస్టుల భర్తీ

### మంత్రి దనసరి అనసూయ సీతక్క

రాష్ట్రంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న 14 వేల పోస్టులను త్వరలోనే భర్తీ చేయనున్నట్లు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు. ములుగులోని సఖీ కేంద్రం ఆవరణలో రూ.1.35 కోట్లతో మంజూరైన బాలసదనం భవన నిర్మాణానికి ఆమె సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో 4 వేల మినీ అంగన్‌వాడీ కేంద్రాలను అప్‌గ్రేడ్ చేసి అంగన్‌వాడీ కేంద్రాలుగా మార్చినట్లు తెలిపారు. ములుగులోని తన క్యాంపు కార్యాలయంలో ఫిర్యాదుల పెట్టె ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. మహాలక్ష్మి పథకం గురించి ఆటో డ్రైవర్లు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని.. వారి సంఘాలతో కాంగ్రెస్ మ్యానిఫెస్టో కమిటీ చర్చించిన తర్వాతే హామీని ప్రకటించామని తెలిపారు. ఆటోడ్రైవర్లకు సంవత్సరానికి రూ.12 వేలు ఇస్తామన్నారు. ములుగు పక్కనున్న నియోజకవర్గాలను కూడా అభివృద్ధి చేయాలని మంత్రిని భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు కోరారు.




## 2,500 లోన్ యాప్స్ తొలగింపు

గూగుల్ తన ప్లేస్టోర్ నుంచి 2,500 మోసపూరిత రుణ యాప్‌లను తొలగించిందని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. 2021 ఏప్రిల్ నుంచి 2022 జులై మధ్య ఈ చర్యలు తీసుకుందని సోమవారం పార్లమెంటులో ఇచ్చిన లిఖితపూర్వక సమాధానంలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. చట్టబద్ధంగా నడుస్తున్న లోన్ యాప్‌ల వివరాలను రిజర్వు బ్యాంకు ప్రభుత్వానికి అందించిందని, ఆ వివరాలను కేంద్ర ఎలక్ట్రానిక్స్ అండ్ ఐటీశాఖ గూగుల్‌కు పంపిందని తెలిపారు. గూగుల్ తన విధివిధానాలను పటిష్ఠం చేసిందని వెల్లడించారు.కొత్త విధానంలో సమ్మతి పొందిన యాప్‌లనే ఆ సంస్థ ప్లేస్టోర్‌లో అనుమతిస్తోందన్నారు. భారతీయ సైబర్ నేరాల సమన్వయ కేంద్రం (14సీ), కేంద్ర హోంశాఖ డిజిటల్ లోన్ యాప్‌లను పర్యవేక్షిస్తున్నాయని వెల్లడించారు.



## రోజుకు 30 మంది రైతుల ఆత్మహత్య.. ఎన్‌సీఆర్‌బీ వెల్లడి!


ప్రధాని నరేంద్ర మోడీ పాలనలో దేశంలో సగటున రోజుకు 30 మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూర్ (ఎన్‌సీఆర్‌బీ) నివేదికలో పేర్కొంది. ఇటీవల విడుదలైన ఈ నివేదిక ప్రకారం 2014-22 మధ్యలో 1,00,474 మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. అత్యధికంగా మహారాష్ట్రలో 2,640, కర్ణాటకలో 1,170, ఆంధ్రప్రదేశ్‌లో 481 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారు.




## నేడు INDIA కూటమి కీలక సమావేశం

ఢిల్లీ వేదికగా సోమవారం ప్రతిపక్ష INDIA కూటమి పార్టీల కీలక సమావేశం జరగనుంది. 2024 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని ఎదుర్కొనే వ్యూహాలు, సీట్ల షేరింగ్ వంటి అంశాలపై చర్చించనున్నారు. పార్లమెంటు శీతాకాల సమావేశాల మధ్యలో జరుగుతున్నందున ఈ సమావేశం ప్రాముఖ్యతను సంతరించుకుంది. పార్లమెంటు నుంచి వివిధ పార్టీలకు చెందిన 92 మంది ఎంపీలను సస్పెండ్ చేశారు. ఈ అంశపైనా నేతలు చర్చించే అవకాశం ఉంది.

## హైదరాబాద్ టీంలోకి ట్రావిస్ హెడ్




ఆస్ట్రేలియాకు చెందిన ట్రావిస్ హెడ్‌పై బిడ్డింగ్ ప్రారంభమైంది. అతని బేస్ ధర రెండు కోట్లు. సన్‌రైజర్స్ హైదరాబాద్ మొదటి వేలం వేయగా, ఆపై ప్రస్తుత విజేత చెన్నై సూపర్ కింగ్స్ వేలంలోకి దూసుకెళ్లింది. ఈ ప్లేయర్ కోసం పోటాపోటీ జరిగింది. రూ.6 కోట్లు దాటింది. చివరకు రూ.6.80 కోట్లకు హైదరాబాద్ కొనుగోలు చేసింది.

### ఊహించని ప్రైజ్ దక్కించుకున్న రోమన్ పావెల్..



ఈ రోజు తొలి ఆటగాడిగా వేలంలోకి వచ్చిన వెస్టిండీస్ ప్లేయర్ రోమన్ పావెల్.. రాజస్థాన్ రాయల్స్ బిడ్డింగ్ ప్రారంభించింది. కోల్‌కతా నైట్ రైడర్స్‌తో పోటాపోటీ బిడ్డింగ్ వార్‌లోకి ప్రవేశించింది. రోవ్‌మన్‌ను ఢిల్లీ క్యాపిటల్స్ విడుదల చేసింది. కానీ, అతను ఇక్కడ జాక్‌పాట్ కొట్టాడు. రాజస్థాన్ రాయల్స్ రూ.7.40 కోట్లకు కొనుగోలు చేసింది. జమైకాకు చెందిన పవర్ ఫుల్ ఆల్-రౌండర్, రోవ్‌మాన్ పావెల్ పరిమిత ఓవర్ల ఆటగాడిగా తనకంటూ చాలా పేరు సంపాదించుకున్నాడు. పేద కుంటుంబం నుంచి వచ్చిన పావెల్ కింగ్‌స్టన్‌లో అతని తల్లి వద్ద పెరిగాడు. భారీ-హిట్టింగ్‌కు ప్రసిద్ధి చెందాడు. అతను 2015 ప్రారంభంలో తన లిస్ట్-A అరంగేట్రం చేశాడు. అతని మొదటి గేమ్‌లోనే మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా ఎంపికైనప్పుడు పావెల్ కెరీర్ వేగం పుంజుకుంది.

### ఢిల్లీ ఖాతాలో చేరిన యువ సంచలనం..



ఇంగ్లండ్ బ్యాట్స్‌మెన్ హ్యారీ బ్రూక్ రూ. 2 కోట్ల బేస్ ప్రైస్‌తో వేలంలోకి వచ్చాడు. ఢిల్లీ క్యాపిటల్స్ అతని కోసం మొదటి బిడ్ చేసింది. ఢిల్లీతో పాటు రాజస్థాన్, బ్రూక్ కోసం పోరాడింది. ఢిల్లీ బ్రూక్ ను రూ.4 కోట్లకు చేర్చుకుంది. గత వేలంలో బ్రూక్‌ను 13.25 కోట్లకు సన్‌రైజర్స్ హైదరాబాద్ కొనుగోలు చేసింది. అయితే ఈసారి విడుదల చేసింది. 2018 ప్రపంచ కప్‌లో ఇంగ్లండ్ అండర్-19 స్క్వాడ్‌లో పాల్గొన్న హ్యారీ బ్రూక్.. రాబోయే యువ బ్యాట్స్‌మెన్, ఇంగ్లండ్ భవిష్యత్ స్టార్‌లలో ఒకరిగా పేర్కొనబడ్డాడు. కుడిచేతి వాటం బ్యాట్స్‌మన్, అతను బంగ్లాదేశ్‌పై 102 పరుగులు చేసి, అలిస్టర్ కుక్ తర్వాత ఆ స్థాయిలో సెంచరీ చేసిన రెండవ ఇంగ్లీష్ ఆటగాడు అయ్యాడు.

## చైనాలో భారీ భూకంపం.. 111 మంది మృతి

### వందల మందికి తీవ్ర గాయాలు



వాయువ్య చైనాలో నిన్న అర్ధరాత్రి దాటాక భారీ భూకంపం సంభవించింది. భూకంపం తీవ్రత ధాటికి దాదాపు 111 మంది మృతి చెందారు. 200 మందికి పైగా గాయపడ్డారు. పలు భవనాలు నేలమట్టమయ్యాయి. చైనాలోని రెండు ప్రావిన్స్‌లలో భూకంపం వచ్చినట్లు అక్కడి స్థానిక మీడియా సంస్థ గ్జిన్హువా న్యూస్ ఏజెన్సీ తెలిపింది. గన్సు ప్రావిన్స్‌లో 100 మంది, పొరుగున ఉన్న కింగ్‌హై ప్రావిన్స్‌లో మరో 11 మంది మరణించినట్లు నివేదించింది. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. భూకంపం ధాటికి భయభ్రాంతులకు గురైన ప్రజలు రోడ్లపై పరుగులు తీశారు. ఈ ప్రాంతంలో భూకంపం తీవ్రత రిక్టర్ స్కూల్‌పై 6.1గా నమోదైనట్లు యూరోపియన్ మెడిటరేనియన్ సీస్మోలాజికల్ సెంటర్ (EMSC) పేర్కొంది. భూకంపం 35 కి.మీ (21.75 మైళ్లు) లోతులో ఉందని, దాని కేంద్రం లాన్‌జౌ, చైనాకు పశ్చిమ-నైరుతి దిశలో 102 కిమీ దూరంలో ఉన్నట్లు EMSC తెలిపింది. దీంతో చైనా జాతీయ కమిషన్, అత్యవసర నిర్వహణ మంత్రిత్వ శాఖ సహాయక చర్యలకు ఉపక్రమించింది. సహాయక బృందాలను ప్రభావిత ప్రాంతాలకు పంపించి రెస్క్యూ ఆపరేషన్ చేపట్టాయి. నేలకూలిన భవనాలకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. కొన్ని స్థానిక గ్రామాలలో విద్యుత్, నీటి సరఫరాలకు అంతరాయం ఏర్పడింది. గడ్డకట్టే చలిలో ఎమర్జెన్సీ వాహనాలు రోడ్ల వెంట్ పరుగులు పెడుతున్నాయి. చైనా కాలమానం ప్రకారం సోమవారం రాత్రి 11:59 నిమిషాలకు భూకంపం సంభవించింది. కాగా, చైనాలో భూకంపాలు సర్వసాధారణం. ఈ ఏడాది ఆగస్టులో తూర్పు చైనాలో 5.4 తీవ్రతతో కూడిన భూకంపం సంభవించింది. ఈ ఘటనలో 23 మంది గాయపడ్డారు. డజన్ల కొద్దీ భవనాలు కూలిపోయాయి. సెప్టెంబర్ 2022లో సిచువాన్ ప్రావిన్స్‌లో 6.6 తీవ్రతతో సంభవించిన భూకంపంలో దాదాపు 100 మంది మరణించారు. 2008లో 7.9 తీవ్రతతో సంభవించిన భూకంపం 5,335 మంది పాఠశాల విద్యార్థులతో సహా 87,000 మందికి పైగా మరణించారు.



## ఢిల్లీ లిక్కర్ స్కాంలో అరుణ్ పిళ్లైకి బెయిల్

ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో హైదరాబాద్ కు చెందిన వ్యాపారవేత్త అరుణ్ రామచంద్ర పిళ్లైకు రౌస్ ఎవెన్యూ కోర్టు రెండు వారాల బెయిలు మంజూరు చేసింది. భార్య అనారోగ్యం దృష్ట్యా 8 వారాలు బెయిల్ మంజూరు చేయాలని పిళ్లై దాఖలు చేసిన పిటిషన్ ను సోమవారం సీబీఐ స్పెషల్ కోర్టు జడ్జి జస్టిస్ ఎంకే నాగ్పాల్ విచారణ జరిపారు. పిళ్లై తరఫున న్యాయవాది నితీష్ రాణా వాదనలు వినిపించారు. పిటిషనర్ భార్యకు శస్త్రచికిత్స కొనసాగుతోందని, హాస్పిటల్ లో ఆమెను చూసుకోవడానికి ఎవరూ లేరని వాదించారు. దీంతో హైకోర్టు.. పిళ్లైకు రెండు వారాల మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది.


## నాపై అక్రమంగా కేసు పెట్టారు హైకోర్టును ఆశ్రయించిన మల్లారెడ్డి

మేడ్చల్ జిల్లా శామీర్‌పేట పోలీసులు తనపై నమోదు చేసిన కేసును కొట్టివేయాలని కోరుతూ ఎమ్మెల్యే, మాజీ మంత్రి మల్లారెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. మేడ్చల్ మండలం మూడుచింతపల్లి మండలం కేశవాపురం గ్రామంలో భూములను కబ్జా చేశారన్న ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేశారు. తనపై అక్రమంగా నమోదు చేసిన కేసును కొట్టివేయాలని కోరుతూ మల్లారెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్ సోమవారం జస్టిస్ కె.సురేందర్ ముందుకు విచారణకు రాగా ప్రజాప్రతినిధుల కేసును విచారించే బెంచ్ ముందు ఈ పిటిషన్‌ను ఉంచాలని రిజిస్ట్రీని ఆదేశిస్తూ విచారణను వాయిదా వేశారు.



## మరో ప్రపంచంలోకి తీసుకెళ్లిన హను మాన్ ట్రైలర్.!

ఒక్కసారిగా ఈ సినిమాపై భారీ హైప్ వరల్డ్ వైడ్ గా లేచింది. ఇక ఇప్పుడు ఎప్పుడెప్పుడా అని ఆసక్తిగా ఎదురు చూస్తున్న ట్రైలర్ కట్ ని అయితే చిత్ర యూనిట్ ఇప్పుడు రిలీజ్ చేశారు. మరి ఈ ట్రైలర్ మాత్రం మరో స్థాయిలో ఉందని చెప్పాలి. కొన్ని వి ఎఫ్ ఎక్స్ షాట్స్ మినహా దర్శకుడు ప్రశాంత్ వర్మ ఓ గ్రాండ్ ట్రీట్ ని అయితే ఇవ్వబోతున్నట్టుగా ఈ ట్రైలర్ చూసాక అనిపిస్తుంది. మెయిన్ గా స్టార్టింగ్ నుంచి ఎండింగ్ వరకు ఓ సూపర్ హీరో సినిమాని చూస్తున్న ఫీల్ ఇందులో కనిపిస్తుండగా వాటితో పాటుగా ఈ తరహా చిత్రాలకి కావాల్సిన గ్రాండియర్ ని కూడా పర్ఫెక్ట్ గా చూపించాడు. ఇక ఇందులో ఇతిహాసాన్ని మిక్స్ చేసి దానికి ఆధునిక ప్రపంచ సృజనాత్మకని జోడించడం ఆసక్తిగా ఉంది.



సూర్య
www.suryaa.com
EVENING EDITION 4PM



## సన్న బియ్యం ధరలకు రెక్కలు

సన్న బియ్యం ధరలు పెరుగుతున్న కొద్దీ సామాన్యుల్లో దడ పుడుతున్నది. ఉమ్మడి జిల్లాలో వాతావరణ పరిస్థితుల దృష్ట్యా ఎక్కువ మంది రైతులు దొడ్డు రకం వడ్లనే పండిస్తున్నారు. దొడ్డు రకం వడ్లకు ప్రభుత్వం కనీస మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేస్తుండడంతో రైతులు శ్రమ లేకుండా కొనుగోలు కేంద్రాల్లో విక్రయించుకుంటున్నారు. దీంతో ఎక్కువ మంది రైతులు సన్న రకం వడ్లపై దృష్టి పెట్టడం లేదు. గత కొన్నేళ్లుగా ఇదే పరిస్థితి కనిపిస్తుండడంతో ఆ ప్రభావం ఇప్పుడు కనిపిస్తున్నది. అయితే, కేసీఆర్ ప్రభుత్వం సన్న రకాల సాగును ప్రోత్సహించినా ఎక్కువ మంది రైతులు దొడ్డు రకాలకే మొగ్గు చూపుతూ వచ్చారు. అయితే, డిమాండ్‌కు తగినట్లు సన్న రకా ల ఉత్పత్తి లేక పోవడం, గత వానకాలంలో వచ్చిన తుఫాన్ కారణంగా ఆంధ్రప్రదేశ్‌లో వరి భారీగా దెబ్బతినడంతో అక్కడి వ్యాపారులు తెలంగాణ జిల్లాల్లో ముఖ్యంగా కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో పండిన సన్నాలు, దొడ్డు రకం వడ్లను ఎక్కువ శాతం కొనుగోలు చేసి తీసుకెళ్లారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచే కాకుండా కర్ణాటక, మహారాష్ట్రకు చెందిన వ్యాపారులు కూడా ఇక్కడి సన్నాలకు భారీ ధర చెల్లించి కొనుగోలు చేశారు. దీంతో సన్న వడ్లు స్థానిక అవసరాలకు కొరతగా మారాయి. దీంతో సన్న బియ్యానికి ధరలు అమాంతం పెరిగాయి.



## కొత్త రేషన్ కార్డుల జారీకి ఆదేశాలు..

తెలంగాణలో ఏళ్ల తరబడి ఆశగా ఎదురుచూస్తున్న పేదల కల సాకారం కాబోతోంది. రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త రేషన్ కార్డుల మంజూరు ప్రక్రియను ప్రారంభించింది. డిసెంబరు 28 నుంచి కొత్త రేషన్‌కార్డుల కోసం దరఖాస్తులు స్వీకరిస్తారు.దీంతో పాటు ప్రస్తుతం ఉన్న రేషన్ కార్డుల్లో మార్పులు, చేర్పులు, తప్పుల సవరణకు సంబంధించి దరఖాస్తులు స్వీకరించనున్నారు. ఈ నెల 28 నుంచి రాష్ట్రంలోని ప్రతి గ్రామంలో గ్రామసభ నిర్వహించి కొత్త రేషన్ కార్డులు, పింఛన్లు, ఇళ్ల స్థలాలపై గ్రామసభలో తీర్మానం చేసి లబ్ధిదారులను ఎంపిక చేస్తామని పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. రేషన్ షాపుల్లో పంపిణీ చేసే బియ్యం పక్కదారి పట్టకుండా నాణ్యమైన సన్నబియ్యం పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని మంత్రి ఉత్తమ్ ఇప్పటికే అధికారులను ఆదేశించారు. కాంగ్రెస్ పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ (పిఎసి) సమావేశం సోమవారం (డిసెంబర్ 18) హైదరాబాద్‌లోని కాంగ్రెస్ ప్రధాన కార్యాలయం గాంధీభవన్‌లో జరిగింది. ఈ సమావేశంలో పలు అంశాలపై చర్చించి కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈ సమావేశంలో మంత్రులు, కాంగ్రెస్ నేతలకు రేషన్‌కార్డుల జారీ ప్రక్రియకు సంబంధించిన కీలక వివరాలను మంత్రి ఉత్తమ్ వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా 28 నుంచి దరఖాస్తులు స్వీకరించి గ్రామసభలో లబ్ధిదారులను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వం హయాంలో సుమారు ఆరేళ్లుగా కొత్త రేషన్ కార్డులు ఇవ్వలేదు. ఉన్న కార్డుల్లో పేర్లు నమోదు చేసుకునేందుకు అవకాశం ఇవ్వలేదు. దరఖాస్తుదారులు నిరీక్షిస్తూనే ఉన్నారు. రేషన్‌తోపాటు ఆరోగ్యశ్రీ, ఇతర సేవలకు రేషన్ కార్డులు తప్పనిసరి అయ్యాయి. కొత్త రేషన్‌కార్డులు ఇవ్వకపోవడంతో లక్షలాది మంది పేదలు సేవలు పొందలేకపోతున్నారు. ఈ నేపథ్యంలో కొత్త రేషన్ కార్డుల కోసం పెద్దఎత్తున దరఖాస్తులు వచ్చే అవకాశం ఉంది.



# 6 గ్యారెంటీలకు 28 నుంచి దరఖాస్తులు..

### గ్రామసభల ద్వారానే లబ్ధిదారుల ఎంపిక

కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలుపై ఆ పార్టీ కీలక ప్రకటన చేసింది. కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవమైన ఈ నెల 28 నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్టు తెలిపింది. పెన్షన్ పెంపు, మహిళలకు రూ.2,500, రూ.500కే గ్యాస్, ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు, కొత్త రేషన్‌కార్డుల జారీ వంటి పథకాలకు దరఖాస్తులను స్వీకరిస్తామని పేర్కొన్నది. గ్రామసభల ద్వారానే దరఖాస్తులు స్వీకరించి లబ్ధిదారులను ఎంపిక చేయాలని నిర్ణయించింది. సోమవారం గాంధీభవన్‌లో నిర్వహించిన పీసీసీ పొలిటికల్ ఎఫైర్స్ కమిటీ (పీఏసీ)లో తీసుకున్న నిర్ణయాలను పీఏసీ కన్వీనర్ షబ్బీర్‌అలీ మీడియాకు వెల్లడించారు. రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రే, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తోపాటు పలువురు మంత్రులు, సీనియర్ నేతలు పాల్గొన్న ఈ సమావేశంలో ఆరు గ్యారెంటీల అమలు, పార్లమెంట్ ఎన్నికలు, టికెట్ల కేటాయింపు, నామినేటెడ్ పోస్టుల భర్తీ, అసెంబ్లీలో వ్యవహరించాల్సిన వ్యూహంపై సుదీర్ఘంగా చర్చించారు.

**అతి త్వరలో నామినేటెడ్ పోస్టుల భర్తీ**

నామినేటెడ్ పోస్టులను వీలైనంత త్వరగా భర్తీ చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పినట్టు షబ్బీర్ అలీ తెలిపారు. గతంలో ఎవరెవరికి హామీ ఇచ్చామో, ఎవరెవరికి ఇవ్వాల్సి ఉంటుందో జాబితా సిద్ధం చేయాలని సీఎం సూచించారని వెల్లడించారు. పదేండ్లపాటు కాంగ్రెస్ కార్యకర్తలు, నేతలు అధికారానికి దూరంగా ఉన్నారని, ఎన్నో కష్టనష్టాలు ఎదుర్కొన్నారని, పోస్టుల భర్తీ ఆలస్యం చేయడం మంచిది కాదని రేవంత్‌రెడ్డి పేర్కొన్నట్టు సమాచారం. నెల రోజుల్లోనే నామినేటెడ్ పోస్టులను భర్తీ చేస్తామని చెప్పినట్టు తెలిసింది.

**సంక్రాంతి తర్వాత అభ్యర్థుల ప్రకటన**

లోక్‌సభకు పోటీ చేసే పార్టీ అభ్యర్థులను సంక్రాంతి తరువాత ప్రకటిస్తామని రేవంత్‌రెడ్డి చెప్పినట్టు సమాచారం. అసెంబ్లీ అభ్యర్థులను ఆలస్యంగా ప్రకటించామని, ఎంపీ అభ్యర్థుల విషయంలో ఆలా చేయబోమని స్పష్టం చేసినట్టు తెలిసింది. ఎమ్మెల్సీ, ఎంపీ టికెట్ల కేటాయింపు వ్యవహారం అధిష్ఠానం చూసుకుంటుందని, తన పాత్ర ఏమీ ఉండదని చెప్పినట్టు సమాచారం. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయిన అభ్యర్థులకు ఎమ్మెల్సీ, ఎంపీ టికెట్లు దక్కే అవకాశం లేదని, ఈ మేరకు అధిష్ఠానం సూత్రప్రాయంగా నిర్ణయం తీసుకున్నదని అన్నట్టు తెలిసింది.

**ఆ శాఖలపై అసెంబ్లీలో చర్చ.. శ్వేతపత్రం విడుదల**

ఆర్థిక, నీటిపారుదల, విద్యుత్తు శాఖ, మిషన్ భగీరథపై అసెంబ్లీలో చర్చించడంతోపాటు శ్వేతపత్రం విడుదల చేస్తామని షబ్బీర్ అలీ తెలిపారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఎంత దారుణంగా ఉన్నదో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ... లో జరిగిన అవకతవకలపై ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పీఏసీ మీటింగ్‌లో వివరించారని చెప్పారు. కాళేశ్వరం కోసం రూ.85-90 వేల కోట్లు ఖర్చు చేసి 90 వేల ఎకరాలకు కూడా సాగునీరు ఇవ్వలేదని ఉత్తమ్ చెప్పారని పేర్కొన్నారు. వీటిపై శ్వేతపత్రం విడుదల చేసి ప్రజల్లో చర్చ పెడుతామని తెలిపారు.

**దరఖాస్తులు, ఎంపిక గ్రామసభల ద్వారానే..**

కాంగ్రెస్ పార్టీ నిర్ణయం ప్రకారం ఆరు గ్యారెంటీల అమలులో గ్రామ సభలు అత్యంత కీలకం కానున్నాయి. దరఖాస్తుల స్వీకరణతోపాటు లబ్ధిదారుల ఎంపిక కూడా గ్రామసభల ద్వారానే చేయాలని కాంగ్రెస్ నిర్ణయించింది. ఇటు పార్టీ తరుపున, అటు ప్రభుత్వం తరుపున ప్రతినిధులను నియమించి గ్రామ సభలను నిర్వహించనున్నారు. గ్రామసభ ద్వారా దరఖాస్తులు స్వీకరించి, అందరి ఆమోదం తెలిపిన వారినే లబ్ధిదారులుగా ఎంపిక చేయనున్నారు. దీని పర్యవేక్షణకు ప్రభుత్వం నుంచి ప్రత్యేకంగా నోడల్ అధికారిని నియమించనున్నారు. అయితే, పథకాల అమలులో తమ కార్యకర్తలకే తొలి ప్రాధాన్యం ఉంటుందని, ఈ విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి గతంలోనే చెప్పారని షబ్బీర్ అలీ పేర్కొన్నారు. తమ కార్యకర్తల భార్యకు, బామ్మర్దికి, తమ్ముళ్లకు, ఇంటోళ్ల పేర్లు పెట్టి అడ్డగోలుగా తీసుకుంటామంటే నడవదని, నిజమైన అర్హులకే ఇస్తామని తెలిపారు. కొత్త హౌసింగ్ శాఖను ఏర్పాటుచేయాలని నిర్ణయించినట్టు వెల్లడించారు.

**పథకాల అమలు ఎప్పటి నుంచి?**

ఆరు గ్యారెంటీల లబ్ధిదారుల ఎంపికకు ఈ నెల 28 నుంచి దరఖాస్తుల స్వీకరిస్తామంటూ షబ్బీర్ అలీ చేసిన కాంగ్రెస్ పార్టీ నిర్ణయానికి సంబంధించినది. దీనిపై ప్రభుత్వం నుంచి కూడా స్పష్టమైన ప్రకటన రావాల్సిన అవసరం ఉంటుంది. పెన్షన్ పెంపు, మహిళలకు రూ. 2500, రూ. 500కే గ్యాస్, ఇంటి నిర్మాణానికి రూ. 5 లక్షలు, కొత్త రేషన్‌కార్డుల జారీ పథకాలకు దరఖాస్తులు స్వీకరిస్తామన్న షబ్బీర్‌అలీ.. ప్రతి కుటుంబానికి 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు, విద్యార్థులకు రూ. 5 లక్షల విద్యా భరోసా కార్డులు వంటి పథకాలపై ఎటువంటి ప్రకటన చేయలేదు.

**పార్లమెంట్ నియోజకవర్గాలకు ఇన్‌చార్జీలు**


సమావేశంలో పార్లమెంట్ నియోజకవర్గాలకు మంత్రులను ఇన్‌చార్జిలుగా నియమిస్తూ నిర్ణయం తీసుకున్నారు. రేవంత్‌రెడ్డి, భట్టి విక్రమార్క, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి రెండేసి నియోజకవర్గాల బాధ్యతలను అప్పగించగా మిగిలిన వారికి ఒక్కో నియోజకవర్గ బాధ్యతను అప్పగించారు.ఇన్‌చార్జిలు వీరేచేవెళ్ల, మహబూబ్‌నగర్-రేవంత్‌రెడ్డి, సికింద్రాబాద్, హైదరాబాద్-భట్టి విక్రమార, నాగర్‌కర్నూల్-జూపల్లి కృష్ణారావు, నల్లగొండ-ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, భువనగిరి-కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, వరంగల్-కొండా సురేఖ, మహబూబాబాద్, ఖమ్మం-పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఆదిలాబాద్-సీతక, పెద్దపల్లి-శ్రీధర్‌బాబు, కరీంనగర్-పొన్నం ప్రభాకర్, నిజామాబాద్-జీవన్‌రెడ్డి, జహీరాబాద్-పీ సుదర్శన్‌రెడ్డి, మెదక్-దామోదర రాజనర్సింహ, మలాజిగిరి-తుమ్మల నాగేశ్వరరావు.



## హోటల్స్ బుకింగ్స్‌లో హైదరాబాద్ టాప్..

### ఓయో ట్రావెలో పీడియా నివేదికలో

కరోనా కారణంగా ఎక్కువగా ప్రభావితమైన రంగాల్లో పర్యాటకం ఒకటని ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ఈ మాయదారి దాటికి పర్యాటక రంగం పూర్తిగా కుదేలైంది. ప్రజలు ప్రయాణాలను మానుకున్నారు. అయితే ఇప్పుడు పరిస్థితి మారింది. మళ్లీ పర్యాటకులు పెరిగిపోయారు. ఈ క్రమంలోనే 2023లో అత్యధిక పర్యాటకులు ఎక్కడ రూమ్ బుక్ చేసుకున్నారన్న దానిపై ప్రముఖ హాస్పిటాలిటీ సంస్థ అయిన ఓయో ఓ నివేదిక విడుదల చేసింది. ఓయో ట్రావెలో పీడియో నివేదికగా ఆధారంగా ఈ ఏడాది అత్యధిక పర్యాటకులు హోటల్ గదులను బుక్ చేసుకున్న నగరంగా హైదరాబాద్ నిలిచింది. ఇక ఎక్కువ మంది పర్యాటకులు సందర్శించిన రాష్ట్రంగా ఉత్తర ప్రదేశ్ నిలిచింది. ఈ నివేదికలో వివరించిన అంశాల ప్రకారం.. సెప్టెంబర్ 30 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు అత్యధిక బుకింగ్స్ జరిగినట్లు తెలిపారు. ఇక అత్యధికంగా హోటల్స్ బుక్ చేసుకున్న నగరాల జాబితాలో రెండో స్థానంలో బెంగళూరు, మూడో స్థానలో ఢిల్లీ, నాల్గవ స్థానంలో కోల్‌కతా నిలిచాయి. ఇక 2022తో పోల్చితే 2023లో చిన్న పట్టణాలైన వరంగల్, గుంటూరు, యూపీలోని గోరఖ్ పూర్, పశ్చిమ బెంగాల్‌లోని దిఘా పట్టణాల్లో అత్యధిక బుకింగ్‌లు జరిగాయి. అలాగే ఎక్కువ హోటల్స్ బుకింగ్ జరిగిన ఆధ్యాత్మిక ప్రదేశాల్లో పూరీ మొదటి స్థానంలో నిలవగా.. అమృత్‌సర్, వారణాసి, హరిద్వార్ ఆ తర్వాతి స్థానాల్లో నిలిచాయి. దేవ్‌ఘర్, పళని, గోవర్ధన్ లాంటి ప్రదేశాల్లోనూ బుకింగ్స్ ఎక్కువగా జరిగాయి. ఎక్కువ మంది హోటల్స్ బుక్ చేసుకున్న రాష్ట్రాల జాబితా విషయానికొస్తే.. మొదటి స్థానంలో ఉత్తరప్రదేశ్ నిలవగా తర్వాతి స్థానాల్లో మహారాష్ట్ర, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లు ఉన్నాయి. 2023లో ఎక్కువ హోటల్ బుకింగ్స్ జరిగిన రోజుగా సెప్టెంబర్ 30నిలవగా, అత్యధిక బుకింగ్స్ జరిగిన నెలగా మే ఉంది. ఇదే విషయమై ఓయో గ్లోబల్ చీఫ్ సర్వీస్ ఆఫీసర్ శ్రీరంగ్ గాడ్‌బోలే మాట్లాడుతూ.. కరోనా కారణంగా ఏర్పడిన సవాళ్ల తర్వాత పరిశ్రమ తిరిగి సాధారణ స్థితికి 2023లో చేరుకుందన్నారు. అందుకే ప్రయాణాలకు సంబంధించి 2023 ప్రత్యేకంగా నిలిచిపోతుందన్నారు. భారత్‌లో వ్యాపార ప్రయాణాలు సైతం వృద్ధికి మద్ధతిస్తున్నాయని తెలిపారు.




## జేఎన్.1తో జాగ్రత్త

### రాష్ట్రాలకు కేంద్ర వైద్య, ఆరోగ్యశాఖ లేఖ

కొవిడ్ జేఎన్.1 వేరియంట్ ప్రబలుతున్న నేపథ్యంలో కేంద్ర వైద్య, ఆరోగ్యశాఖ రాష్ట్రాలను అప్రమత్తం చేసింది. ఈ మేరకు ఆ శాఖ కార్యదర్శి సుధాంశ్ పంత్ సోమవారం అన్ని రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులకు లేఖ రాశారు. ఇటీవల కాలంలో కేరళలాంటి కొన్ని రాష్ట్రాల్లో కొవిడ్ కేసులు పెరిగాయని, ఇదే సమయంలో కొత్త వేరియంట్ ప్రభావం పెరిగిందని పేర్కొన్నారు. అందువల్ల అన్ని ప్రభుత్వాలు తగిన నియంత్రణ చర్యలు చేపట్టాలని సూచించారు. రాబోయే పండగల సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని వైరస్ విస్తరించకుండా అడ్డుకోవడానికి తగిన నియంత్రణ చర్యలు చేపట్టాలి. శ్వాశకోశ సంబంధ పరిశుభ్రత పాటించేలా చూడాలి. కేంద్ర ప్రభుత్వం ఇదివరకు జారీ చేసిన కొవిడ్-19 నియంత్రణ మార్గదర్శకాలను అమలు చేయాలి. జిల్లాల వారీగా ఆసుపత్రులకు వచ్చే ఐఎల్ఐ (ఇన్‌ఫ్లుయెంజా లైక్ ఇల్‌నెస్), సారి (సీవియర్ అక్యూట్ రెస్పిరేటరీ ఇల్‌నెస్) రోగులను నిరంతరం పర్యవేక్షించాలి. వారి వివరాలను ఇంటిగ్రేటెడ్ హెల్త్ ఇన్ఫర్మేషన్ ప్లాట్‌ఫామ్‌లో నమోదు చేసి కేసుల పెరుగుదలను తొలి దశలోనే పసిగట్టాలి. కొవిడ్-19 పరీక్ష మార్గదర్శకాల ప్రకారం.. అన్ని జిల్లాల్లో తగిన పరీక్షలు నిర్వహించాలి. అందులో కేంద్ర ప్రభుత్వం సిఫార్సు చేసిన నిష్పత్తి ప్రకారం ఆర్‌టీపీసీఆర్, యాంటీజెన్ టెస్టులు నిర్వహించాలి.

## 'విడాకులొద్దు.. భర్త వీర్యంతో IVFలో పిల్లలు కావాలి'



భర్త వీర్యంతో IVF పద్ధతిలో పిల్లలను కనాలనుకుంటున్నానని సుప్రీంకోర్టులో ఓ అనూహ్యమైన పిటిషన్ విచారణకు వచ్చింది. పిల్లల్ని కనేవారకు అతను భోపాల్ ఫ్యామిలీ కోర్టులో దాఖలు చేసిన విడాకుల పిటిషన్‌పై స్టే విధించాలని ఓ 44 ఏళ్ల మహిళ కోరింది. తాను నివాసముంటున్న లక్నోకు కేసు విచారణను బదిలీ చేయాలని కోర్టుకు విన్నవించుకుంది. సానుకూలంగా స్పందించిన సుప్రీంకోర్టు.. 6 వారాల్లో భర్తకు నోటీసులివ్వాలని భోపాల్ కోర్టును ఆదేశించింది.

## 14 ఏళ్ల బాలికపై తండ్రి అత్యాచారం

ఓ కసాయి తండ్రి కన్నకూతురిపై అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ ఘటన మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్ జిల్లాలో చోటు చేసుకుంది. పాత కంటోన్మెంట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని నివసిస్తున్న 14 ఏళ్ల బాలిక పాఠశాలకు వెళ్లింది. అయితే బాలిక తండ్రి స్కూల్‌కు వచ్చి పని ఉందని ఆమెను ఇంటికి తీసుకెళ్తాడు. అక్కడి నుంచి పొలానికి తీసుకెళ్లి బాలికపై అత్యాచారం చేశాడు. తండ్రి చేసిన ఆకృత్యాన్ని బాలిక తన తల్లికి చెప్పింది. దాంతో తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది.



# బాలకృష్ణ సినిమాలో తమన్నా?

టాలీవుడ్ సీనియర్ హీరో నందమూరి బాలకృష్ణ. ఇక ఈ సినిమాలు ఇచ్చిన జోష్‌తో మరో బ్లక్ బస్టర్ కాంబోను లైన్‌లో పెట్టాడు. బాలకృష్ణ తాజాగా నటిస్తున్న క్రేజీ ప్రాజెక్ట్ NBK 109. వాల్తేరు వీరయ్యతో ఈ ఏడాది బ్లాక్ బస్టర్ అందుకున్న బాబీ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నాడు. తాజాగా ఈ సినిమా షూటింగ్ ప్రారంభమైన విషయం తెలిసిందే. ఇదిలా ఉంటే.. తాజాగా ఈ సినిమా నుంచి ఒక సాలిడ్ న్యూస్ బయటకు వచ్చింది.బాబీ తీసే సినిమాలలో ఒక ప్రత్యేక ఐటమ్ సాంగ్ ఒక రేంజ్‌లో బ్లాక్ బస్టర్ అయ్యింది. దీని తర్వాత రీసెంట్‌గా వచ్చిన వాల్తేరు వీరయ్య సినిమాలో బాస్ పార్టీ సాంగ్ కూడా సూపర్ హిట్‌గా నిలిచింది. అయితే తాజాగా వస్తున్న ఎన్‌బీకే 109 సినిమాలో కూడా బాబీ ఒక ఐటమ్ సాంగ్ ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తుంది. ఇక ఈ సాంగ్ కోసం మిల్కీ బ్యూటీ తమన్నాను సంప్రదించినట్లు టాక్. దీనిపై తమన్నా కూడా ఓకే చెప్పినట్లు సమాచారం. సితార బ్యానర్‌పై సూర్యదేవర నాగవంశీ, ఎస్.సాయి సౌజన్య సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.